# "సమీపించి యున్నది"

## చదువుటకు నియమించినవి #3

**II. స్నానికుడైన యోహాను పరిచర్య ఆరంభము.**

A. యోహాను పరిచర్య (మత్తయి 3:1-6; మార్కు 1:1-6; లూకా 3:1-6).

B. యోహాను సందేశం (మత్తయి 3:7-12; మార్కు 1:7, 8; లూకా 3:7-18).

**III. యేసు సువార్త ఆరంభము.**

A. యొర్దాను నదిలో యేసు యోహానుచే ముంచడం పొందాడు (మత్తయి 3:13-17; మార్కు 1:9-11; లూకా 3:21, 22; యోహాను 1:31-34).

B. యేసు అరణ్యంలో శోధింపబడెను (మత్తయి 4:1-11; మార్కు 1:12, 13; లూకా 4:1-13).

C. యేసును గూర్చి యోహాను సాక్ష్యము (యోహాను 1:19-34).

## పరిచయం

స్నానికుడైన యోహాను "యూదయ అరణ్యములో ప్రకటించుటకు వచ్చినప్పుడు," అతని సందేశ ప్రధానాంశం: "– పరలోకరాజ్యము[1] సమీపించి యున్నది మారుమనస్సు పొందుడి" అనేదే (మత్తయి 3:1, 2). అతని శ్రోతలకు ఈ మాటలు ఏలాటి ఉల్లాసాన్ని కలిగించియుంటాయో మనం గ్రహించడం కష్టం. మెస్సీయా యుగము "సమీపించి యున్నది." మెస్సీయా స్వయంగా ప్రత్యక్షమవ్వడానికి ఎక్కువ కాలం పట్టదు!

"మనకు శిశువు పుట్టెను" అనే పాఠం, ప్రభువైన యేసుని మొదటి ముప్పది సంవత్సరాల సిద్ధపాటు సంవత్సరాలపై కేంద్రీకరించబడింది. తరువాత పాఠం, క్రీస్తు ప్రభువు పనిలో ఆరంభ దినాలకు సంబంధించినది. ఆయన క్రీస్తని ప్రకటించారు. ఈ రెండింటికి మధ్య – చివరిగడియ సిద్ధపాటు అవసరమయ్యింది. యేసు బహిరంగ పరిచర్యకు మూలయత్నంగా ఈ సంఘటనల స్టడీ ఉద్దేశింపబడింది.

## మెస్సీయా కొరకు ఎదురుచూపు

## (మత్తయి 3:1-12; మార్కు 1:1-8; లూకా 3:1-18)

మెస్సీయా కొరకు మార్గం సిద్ధపరచడానికి ముందుగా ఒకడు వస్తాడని ప్రవక్తలు ముందుగానే (యెషయా 40:3-5; మలాకీ 3:1; 4:5, 6) చెప్పారు. తన కుమారుడైన యోహాను మెస్సీయాకు ముందుగా వెళ్లువాడనే సంగతి యాజకుడైన జెకర్యాకు తెలిసింది (లూకా 1:17).

యోహాను చేయబోయే పనిని యెషయా ఒక రోడ్డు బిల్డర్ పనితో పోల్చాడు:

– **ప్రభువు** మార్గము సిద్ధపరచుడి
ఆయన త్రోవలు సరాళము చేయుడి
ప్రతిపల్లము పూడ్చబడును
ప్రతికొండయు మెట్టయు పల్లము చేయబడును
వంకరమార్గములు తిన్ననివగును
కరుకు మార్గములు నున్ననివగును
సకల శరీరులు దేవుని రక్షణ చూతురు (లూకా 3:4, 5; యెషయా40:3, 4).

ఆ దినాల్లో, రాజు కరకుగానున్న రోడ్లపై ప్రయాణం చేయబోతున్నప్పుడు, ఆ రోడ్లను చదునుచేసే పనివారు ముందుగా వెళ్లి రాజు యొక్క ప్రయాణానికి దాన్ని సిద్ధం చేస్తారు. ఆలాటి పోలికను ప్రవక్త ఉపయోగించాడు. అయితే యోహాను పనికి సంబంధించి, అది భూమిపైనున్న పల్లాలను పూడ్చడం కాదు, కాని విషయ పరిజ్ఞానములేని పల్లాలను పూడ్చడమైయుంది. అతడు పడద్రోయవలసింది, కొండలకు సంబంధించిన బండలను కాదు, గర్వపు పర్వతాలనే చదును చేయవలసియుంది. మెస్సీయాను గూర్చి వంకర భావాలను – సత్యాన్ని ఉపదేశించడం వలన తిన్నగా చేయవలసియుంది.

మొత్తానికి, మెస్సీయాను గూర్చియు, ఆయన పనిని గూర్చియు యూదులమధ్య తప్పుడు భావన అపార్థంవలన కలిగింది. తమ శత్రువులను ఓడించి తమ దేశాన్ని పురాతన మహిమకు పునరుద్ధరించే భూరాజే తమ మెస్సీయా అయ్యుంటాడని వారి భావన. మెస్సీయా రాజ్యము ఆత్మసంబంధమైనదని, దానికి ఆత్మసంబంధమైన భావాలతో ప్రజలు ఉండవలసిందనే విషయాన్ని యోహాను పరిచయం చేయాలి.

### యోహాను ప్రకటన[2]

కడసారిగా మనం యోహానును చూచినప్పుడు, అతడు "అరణ్యంలో ఉన్నాడు" (లూకా 1:80).[3] ఆ పంటలేని ప్రాంతంలో, అతడు కఠినమైన జీవితాన్ని జీవించాడు. అతడు ముతక వస్త్రాలను ధరించాడు (మత్తయి 3:4; 2 రాజులు 1:8 చూడు); మిడుతలను, అడవితేనెను తినేవాడు (మత్తయి 3:4).

చివరికి, యోహాను నొద్దకు "దేవుని వాక్యము వచ్చెను" (లూకా 3:2), అతడు ప్రకటింప నారంభించాడు. యోహాను పరిచర్యలోని ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి దాని ప్రారంభోత్సవం సూచిస్తూ ఐదుగురు రాజకీయ నాయకులను,[4] ఇద్దరు మత నాయకులను[5] లూకా ఉపయోగిస్తాడు.

యోహాను ప్రసంగంలోని కీలక పదం "మారుమనస్సు." "మారు మనస్సు" అంటే, "జీవిత మార్పుగా పరిణమించే మనస్సు మార్పు."[6] మారుమనస్సు పొందనొల్లనివారు దేవుని ఉగ్రతను ఎదుర్కొవలసి వస్తుంది (మత్తయి 3:7, 10; లూకా 3:9). రాజ్యము కేవలం రక్తసంబంధులకు మాత్రమే కాదు, కాని నైతిక శీలము గలవారికే (మత్తయి 3:8, 9; లూకా 3:8).

మార్పు రావలసిన అవసరతకు సంబంధించి, యోహాను సాధారణంగా కాక నిర్దిష్టంగా సూచించాడు. "మారుమనస్సుకు తగిన ఫలములు ఫలించుడని" అతడు వారికి ఉపదేశించాడు

(మత్తయి 3:8; లూకా 3:8ని చూడు). అతడు స్పష్టమైన ఉదాహరణల నిచ్చాడు. స్వార్థపరులైన జనసమూహాలకు లేని వారితో తమకు కలిగినవి పంచు కోవాలన్నాడు (లూకా 3:11),[7] ప్రభుత్వ అధికారులు యథార్థంగా ఉండాలన్నాడు (లూకా 3:13), అధికారంలో ఉన్నవారు అధికార దుర్వినియోగానికి పాలు పడకూడదని ఉద్ఘాటించాడు (లూకా 3:14). మనుష్యులందరు తమ పాపములను ఒప్పుకొనడానికి పిలుపు నిచ్చాడు (మార్కు 1:5). ఈ కార్యములను చేయ నిరాకరించిన వారిని అతడు "సర్పసంతానమా" అని పిలిచాడు (మత్తయి 3:7). నేడు దానిని "గడ్డిలో పాముల్లారా" అని అంటారు.[8]

అతని సాహసాన్ని బట్టి – లేక అతడు సాహసించినప్పటికి – ఎక్కువ మంది తన అనుచరులగునట్టు ఆకర్షించాడు. "అంతట యూదయ దేశస్థులందరును, యెరూషలేము వారందరును;[9] బయలుదేరి అతని యొద్దకు వచ్చి, తమ పాపములు ఒప్పుకొనుచు, యొర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి"[10] (మార్కు 1:5).

## యోహాను అభ్యాసం

యోహాను పరిచర్యలో బాప్తిస్మము తప్పని సరియైన భాగం. యూదుల పద్ధతి సంబంధమైన ప్రక్షాళనలలో యోహాను బాప్తిస్మమునకు పూర్వసంభవాలను లేక ఉదాహరణలను కనుగొనడానికి ప్రయత్నించారు కాని యోహాను బాప్తిస్మము వేరైనది.[11] యోహాను "స్నానికుడైయున్నట్టు" పిలువబడ్డాడు (మత్తయి 3:1), అదే అతని యొక్క ప్రత్యేకమైన గురుతు.[12]

"Baptist" అనేది గ్రీకు పదం యొక్క ఆంగ్ల రూపం. "baptize" అనే పదానికి అంతంలో (–tes) అనే ప్రత్యేక లక్షణాన్ని సూచించే చేరిక కలుపబడింది. ("Baptist" అక్షరార్థంగా, "బాప్తిస్మమిచ్చువాడు." ఈ వరుసలో యోహానుకు నేను ఉపయోగించే పదం యిదే.

యొర్దాను నదిలో జనులకు యోహాను బాప్తిస్మమిచ్చాడు. తన సందేశం ప్రతివానికి అందుబాటులో ఉండునట్లు అతడు నదికి అటు యిటు తిరుగుతూ ఉండేవాడు. లూకా 3:3 యిలా అంటుంది: "... బాప్తిస్మము పొందవలెనని యొర్దాను నదీ ప్రదేశమందంతట ప్రకటించుచుండెను." "యొర్దాను నది యిరువైపులను యోహాను ఒక చోటు నుండి మరియొక చోటుకు వెళ్లెను" అంటూ Living Bible భావార్థం చెప్పింది. యోహాను బాప్తిస్మమిచ్చిన ఆయాప్రాంతాలను గూర్చి మనకు తెలియ వచ్చింది (యోహాను 1:28; 3:23).

యోహాను బాప్తిస్మం నీట ముంచడమే. బాప్తిస్మమని మనం ఉపయోగించే గ్రీకు మూలానికి, "ముంచు, మునుగునట్లు చేయు" అని అర్థం.[13] గ్రీకు పదానికి అర్థం మనకు తెలియకపోయినా, యోహాను బాప్తిస్మం ముంపే. యోహాను 3:23 ఈ విషయాన్ని యిలా నొక్కి చెప్పుతుంది, "సలీము దగ్గరనున్న ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను గనుక యోహాను కూడా అక్కడ బాప్తిస్మమిచ్చుచుండెను." చిలకరింపుకు విస్తారమైన నీళ్లు అవసరం లేదు, ముంచడానికే కావాలి. యోహాను ప్రభువైన యేసునకు బాప్తిస్మమిచ్చిన తరువాత, ఆయన "నీళ్లలోనుండి ఒడ్డునకు" వచ్చెను (మార్కు 1:10; మత్తయి 3:16 చూడు). యోహాను కేవలం చిలకరిస్తూ ఉండినట్టయితే, నేడు నీళ్లకు వెలుపల చిలకరింపు అభ్యసించేవారు, అతని యొర్దాను నది వెలుపల ఉంచేవారేమో.

యోహాను బాప్తిస్మము – "పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన

బాప్తిస్మము" (మార్కు 1:4; లూకా 3:3). "మారుమనస్సు విషయమైన బాప్తిస్మము" అని అది ఎందుకు పిలువబడిందంటే – అది మారుమనస్సును వ్యక్తపరచునదై ఉంది.[14] అది "పాపక్షమాపణ నిమిత్తమైన"ది : యోహాను జనులను పాపము విషయమై ఒప్పించడం మాత్రమేగాక, ఆ పాపముల క్షమాపణను గూర్చి నిరీక్షణను కూడా అతడు వారికిచ్చాడు. మానవాళి పాపము కొరకు క్రీస్తు మరణాన్ని అతని బాప్తిస్మము కనిపెట్టింది.

**యోహాను ఉద్దేశం**

మెస్సీయా కొరకు ప్రజల హృదయాలను, జీవితాలను ఆయత్తం చేయుటయే యోహాను పరిచర్యయొక్క ప్రాథమిక ఉద్దేశం (యోహాను 3:28 చూడు). జనసమూహాలకు అతడు యిలా తెలియజేశాడు: "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్లలో మీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నా కంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ..." (మత్తయి 3:11; యోహాను 1:27, 30లను చూడు). చెప్పులు విప్పుట బానిస పనియైయుంది. గనుక, యోహాను చెప్పేదేమంటే –"నేను ఆయనకు బానిసగా ఉండడానికి కూడా అర్హుడను లేక పాత్రుడను కాను."

అతని పనికిని, క్రీస్తు పనికిని గల తారతమ్యాన్ని అతడిలా సూచించాడు: "నా మట్టుకు, నేను మారుమనస్సు నిమిత్తము మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను ... ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్లలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను; ... ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్తయి 3:11). పరిశుద్ధాత్మలో బాప్తిస్మము, అగ్నితో బాప్తిస్మమనేవి– రెండును ఒకటే కావని సందర్భము సూచిస్తుంది. అంగీకరించెడు –అంగీకరింపని అనే మిశ్రిత జనంతో యోహాను మాట్లాడుతున్నాడు (మత్తయి 3:5–7).[15] ప్రభువైన యేసు మరణము, సమాధి, పునరుత్థానముల తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన అపొస్తలులకు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం జరిగింది (అపొ. 1:5, 8; 2:1–4). **ఆత్మ** శక్తిలో వారు ముంచి తేల్చబడ్డారు. మరోవైపు, తీర్పు దినాన భక్తిహీనులను ముంచే దాన్ని అగ్ని బాప్తిస్మం సూచిస్తుంది (మత్తయి 3:12).

## మెస్సీయా బాప్తిస్మం పొందాడు
## (మత్తయి 3:13-17; మార్కు 1:9-11; లూకా 3:21, 22; యోహాను 1:31-34)

యోహానుపైనున్న జనాభిమానపు ఔన్నత్యంలోను – మెస్సీయా రాక విషయంలో ఉన్న నిరీక్షణౌన్నత్యంలోను యేసు – అతని యొద్ద బాప్తిస్మం పొందవచ్చాడు.[16] ఆ సమయంలో, క్రీస్తు "దాదాపు ముప్పది ఏండ్ల యీడు గలవాడు" (లూకా 3:23).

ఇంతకు మునుపు యోహాను ప్రభువును చూచాడో లేదో మనకు తెలియదు. ముందుగా గుర్తించినట్టే, వారి తల్లులు, బంధువులును స్నేహితులునైయున్నారు.[17] యెరూషలేము పండుగ

దినాల్లో యోహాను, యేసూ కలిసికొనే అవకాశముంది, అది జరిగి ఉండవచ్చునేమో వారు కలిసికొన్నా లేకపోయినా, బాప్తిస్మం పొంద వేచియున్న వారిలో యితరులవంటి వాడు ప్రభువుకాడని ఎలాగో యోహానుకు తెలిసింది. యోహాను బాప్తిస్మము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము, అయితే యేసుకు మారుమనస్సు పొందవలసిన ఏ పాపమూలేదు. అతని బాప్తిస్మం పాపక్షమాపణకొరకైన బాప్తిస్మము, క్షమింపబడవలసినవేవీ ప్రభువునకు లేవు. మొదటిలో క్రీస్తుకు బాప్తిస్మమియ్యడానికి యోహాను వెనుకంజవేశాడు: "– నేను నీ చేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా?" అంటూ ఆయనను నివారింప జూచాడు (మత్తయి 3:14).

యేసుకు యే పాపము లేనందున మనకు వలె ఆయన బాప్తిస్మం పొందనవసరమేమి? ఆ ప్రశ్నకు క్రీస్తు తానే యిలాగు బదులిచ్చాడు! "– ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నది"[18] (మత్తయి 3:15). యోహాను బాప్తిస్మం పరలోకం నుండి వచ్చింది (మత్తయి 21:25), యోహాను బాప్తిస్మమును నిరాకరించిన వారు "తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి" (లూకా 7:30). దేవుని చిత్తానికి కేంద్రస్థానంలో ప్రభువైన యేసు నిలువగోరాడు[19] – యోహాను బాప్తిస్మం దేవుని చిత్తంలో భాగమైయున్నట్టు ఆయన గ్రహించాడు. గనుక, తానేమి జరిగించాలో అనే దాన్ని గూర్చి ఆయనకు ప్రశ్నయే లేదు: ఆయన బాప్తిస్మం పొందాలి–అందువలన ఆయన ఆ పని చేశాడు. బాప్తిస్మం విషయంలో ప్రతివారికి నేడు ఆలాటి దృష్టి కలిగియున్నట్టయితే, ఆశ్చర్యంగా ఉండదా?

చివరికి, ప్రభువుకు బాప్తిస్మమివ్వడానికి యోహాను సమ్మతించాడు. ఆయన బాప్తిస్మము పొందినతోడనే ప్రార్థిస్తున్నాడు (లూకా 3:21).[20] ఒక అద్భుతమైన దాన్ని యోహాను చూచాడు, ఒక వింతైన శబ్దాన్ని విన్నాడు:

> యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరువబడెను; దేవుని ఆత్మ పావురమువలె[21] దిగి తన మీదికి వచ్చుట చూచెను. మరియు – ఇదిగో ఈయనే నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను (మత్తయి 3:16, 17).[22]

దాదాపు ముప్పది ఏండ్ల కాలపు క్రీస్తు సిద్ధపాటుపై దేవుడు అంగీకారపు ముద్రవేశాడు. ఆ విధంగా ఆయన క్రీస్తును తన పరిచర్యకు సన్నాహపరిచాడు (లూకా 4:18; అపొ. 10:38లను చూడు).

ఈ సంభవానికి ముందు, యేసే మెస్సీయాయై ఉంటాడని యోహాను సందేహం కలిగియుండే వాడే, కాని ఆ సంగతి అతనికి తెలిసింది కాదు. తాను మెస్సీయాను గుర్తిస్తాడని దేవుడు అతనికి సూచించాడు: "– నీవెవనిమీద **ఆత్మ** దిగివచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చువాడని నాతో చెప్పెను" అని యోహాను అన్నాడు (యోహాను 1:33). **ఆత్మ** ఆకాశమునుండి దిగివచ్చుట చూచినప్పుడు యోహాను ఆనందానికి హద్దులు లేకుండానే ఉండవచ్చు. దేవుడు తన వాక్యానికి నమ్మకమైనవాడై యుంటాడు! క్రీస్తు వచ్చాడు!

## మెస్సీయా పరీక్షించబడ్డాడు

## (మత్తయి 4:1-11; మార్కు 1:12, 13; లూకా 4:1-13)

ప్రభువైన యేసు బాప్తిస్మము పొందినతోడనే, ఆయన శోధనలను గూర్చిన సమాచారముంది. బాప్తిస్మమంటే శోధనలేకుండపోవడం కాదు. మనం బాప్తిస్మం పొందినప్పుడు మన మీద తన దాడులను తగ్గించడు, పైగా ముమ్మరం చేస్తాడు. బాప్తిస్మం పొందినంతమాత్రాన, శోధనలను ఎదిరించడానికి సహాయం చేస్తాడని భావమా? (1 కొరింథీ. 10:13; హెబ్రీ. 13:5).

"అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు **ఆత్మవలన** అరణ్యమునకు కొనిపోబడెను" అనే మాటల్లో శోధనకు సంబంధించిన ముఖ్య విషయం తెలుస్తుంది. (మత్తయి 4:1; లూకా 4:1 చూడు). దేవుని ఉద్దేశాలు నెరవేర్చబడడానికి ప్రభువైన యేసును శోధించవలసియుంది.

దేవుని ఉద్దేశాలను మనం సంపూర్ణంగా గ్రహించలేం. అయితే "శోధన" అనే పదం మనకు ఒక చిట్కానిస్తుంది. శోధన అనే గ్రీకు పదాన్ని "పరీక్ష" అని కూడా తర్జుమా చేయవచ్చు. సాతాను దృష్టిలో, యేసు అరణ్యంలో జీవించడం శోధనకు అనుకూలమైనదిగా ఉండవచ్చు. – పాపం చేసేలా సాతాను యేసును పురికొల్పాడు. (తన పనియావత్తును లయపరచడానికి ఆయనను అపవాది ఒక్కసారియైనా పాపం చేయించాలి). దేవుని దృష్టిలో, ఆ నలువది దినములు – పరీక్షించు కాలమైయుంది. యేసుని నిజమైన విలువ మరియు శీలం రుజువు చేయబడే కాలమది. [23]

శోధనలలో మూడు దాఖలు చేయబడ్డాయి.[24] 1 యోహాను 2:16లో పేర్కొనబడిన మూడు మార్గాలకు సంబంధించినవిగా శోధనలు ప్రాథమికంగా ఉన్నాయి: "శరీరాశ [ఆకలి తీర్చుకొనడానికి రాళ్లను రొట్టెలుగా చేసికొనుట], నేత్రాశ [లోక రాజ్యములను వాటివైభవాన్ని చూడడం], మరియు జీవపు డంబము [దేవాలయపు శిఖరం మీదనుండి జన సమూహముల కన్నుల యెదుట క్షేమకరంగా దుముకుట]."

ప్రభువైన యేసు "మనవలెనే అన్ని విధములు"గా శోధింపబడినట్టు హెబ్రీయులకు రచయిత అన్నాడు (హెబ్రీ. 4:15ఎ). మనం అనుభవించిన వేలకొలది శోధనలకు ప్రభువు గురిచేయబడినట్టు చెప్పలేదు కాని మనం ఎదుర్కొనే శోధనలవంటి ప్రతిశోధనను ఎదుర్కొన్నాడని హెబ్రీ రచయిత చెప్పాడు. మత్తయి 4, లూకా 4లో శోధనలే మనలను వశపరచుకునే వాటికి ప్రాతినిథ్యం వహిస్తాయి.

యేసు శోధింపబడ్డాడనేది కొందరికి అక్కర కలిగిస్తుంది. అది కొందరిని బాధిస్తుంది. ఎందుకంటే, శోధన అనగానే పాపము అనే భావన వారికి కలుగుతుంది. "నరుడు తప్పుచేయాలని కోరుకునేవరకు నిజంగా ఏ శోధనా ఉండదని; తప్పు చేయగోరాడంటే పాపమేనని" వారి తలంపు. ప్రభువైన యేసు పాపం చేసే అవకాశముందంటే కొందరికి భీతి కలిగించవచ్చు. అవకాశమున్నా ఆయన పాపం చేయకపోవడమే ఆయన ప్రత్యేకత.

శోధనను గూర్చి మనం ఎన్నడూ అర్థం చేసికోలేనిది కొంత ఉంది. అది ఎక్కడికి వస్తుందంటే – యేసు సంపూర్ణ నరుడై, అదే సమయంలో సంపూర్ణంగా దేవుడై ఉండడం

వలన అక్కడే ఈ అర్థంకాని స్థితి ఏర్పడుతుంది.[25] అయినప్పటికిని, ఈ మూడు తీర్మానాల విషయంలో మనం నిశ్చయత కలిగియుండవచ్చు: (1) యేసు శోధింపబడగలడు. లేనట్టయితే, శోధనను గూర్చిన సమాచారానికి అర్థమే ఉండదు. అది ఎలా సాధ్యమౌతుందో నేను ఎరిగినా ఎరుగక పోయినా, యేసు శోధింపబడ్డాడని లేఖనం చెప్పుతుంది. (2) పాపమనేది శోధింపబడడంలోనే లేదు. ఈ సత్యము ఆ వర్ణనలోనే గుప్తమైయుంది. పాపము శోధనలో లేదు, శోధనకు లోబడడంలో ఉంది. (3) యేసు శోధనకు లోబడలేదు. "సమస్త విషయములలోను మనవలెనే అన్ని విధముల శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను." (హెబ్రీ. 4:15).[26] దీనికొరకు దేవునికి స్తోత్రము! ఒక వేళ క్రీస్తు పాపము చేసియుంటే, "మనము దేవుని నీతియగునట్లు" ఆయనను మనకొరకు పాపముగా చేసేవాడు కాడు (2 కొరింథీ. 5:21)!

శోధకుడు ఆయనను విడిచిపోగా, "ఇదిగో దేవదూతలువచ్చి ఆయనకు పరిచర్య చేసిరి" (మత్తయి 4:11). మన జీవితాలలో శోధనలు వచ్చినంత మాత్రాన దేవుడు మనలను విడిచిపెట్టడు.

## మెస్సీయా ప్రకటింపబడ్డాడు
## (యోహాను 1:19-34)

శోధన అనంతరం, యోహాను ప్రకటిస్తున్న చోటికి ప్రభువైన యేసు తిరిగి వచ్చాడు (26, 29 వచనాలు).

### కాదని చెప్పుట

యోహాను జనాభిమాన ప్రభావము యెరూషలేములోని నూతన నాయకులను కలవరపరచినట్లుంది. గనుక ప్రవక్తయైన యోహానును ప్రశ్నించడానికి పరిసయ్యులు (యోహాను 1:24) లేవీయులను, యాజకులను పంపారు. తాను మెస్సీయ్యావా (క్రీస్తా),[27] ఏలీయావా లేక "ఆ ప్రవక్తవా" అని అడుగ వచ్చారు. "లేదు" అని యోహాను స్థిరంగా చెప్పాడు (యోహాను1:19–21).

"ఆ ప్రవక్త" అనేది "క్రీస్తు" అనే దానితో జోడించడంలోనే మత నాయకుల తికమక తెలియ వస్తుంది. తాము ముందుగా ఊహించినవాటికి, మెస్సీయా ప్రవచనాలు కలవటం లేదు. గనుక ఆ లేఖనాలు "నా వంటి ప్రవక్త" అని మోషే తెలియ జేసినవానికి వర్తిస్తాయని వారు తలంచారు (ద్వితీయో. 18:15). మోషే మాటలు రాబోయే మెస్సీయాను సూచించేవే,[28] అయితే నీడవంటి "ఆ ప్రవక్త" అనే వేరైన ఒక వ్యక్తిని మత నాయకులు కల్పించారు.

తాను ఏలీయాను కానని గట్టిగా చెప్పినందుకు నీవు ఆశ్చర్యపడవచ్చు (యోహాను 1:21). తాను మెస్సీయాకు ముందుగా వచ్చిన వానినేననిచెప్పి, అతడు యెషయా 40:3ను కోట్ చేశాడు. యెషయా 40:3లోని ప్రవచనం మలాకీ 3:1తో ముడివేయబడియుంది (మార్కు 1:2, 3[29]). అది మెస్సీయాకు ముందుగా వచ్చు వానిని సూచిస్తుంది. మలాకీ అతనిని "ప్రవక్తయైన ఏలీయా" అని పిలిచాడు (మలాకీ 4:5). యోహాను మలాకీచే

ప్రవచింపబడిన "ఏలీయాయే." ఇది నిజమని ప్రభువైన యేసు స్వయంగా ఈ విషయాన్ని స్థిరపరచాడు. ఆయన యిలా అన్నాడు: "ఈ సంగతి నంగీకరించుటకు మీకు మనస్సుంటే రాబోవు ఏలీయా యితడే." (మత్తయి 11:14; 17:10–13 చూడు).

మరి, తాను ఏలీయాను కానని యోహాను ఎందుకు చెప్పాడు? అసలు ఏలీయా తిరిగి వస్తాడని యూదులు అనుకొంటున్నారు.[30] శరీరంలో తాను ఏలీయాను కాదని యోహాను అంటున్నాడు. అయితే అతడు "ఏలీయా యొక్క ఆత్మయు, శక్తియు" గలవాడైయున్నాడు (లూకా 1:17) కాని యోహాను అసలైన ఏలీయా కాడు.

**ప్రకటన**

యెరూషలేమునుండి వచ్చిన ప్రాతినిధ్యాన్ని ఎదుర్కొన్న తరువాత, యేసే మెస్సీయా యని ప్రకటించి, ప్రజల దృష్టికి ఆయనను తెచ్చే తొలి అవకాశము యోహాను పొందాడు. నడచుచున్న యేసును చూచి, "ఇదిగో, లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱె పిల్ల" అని సూచించాడు (యోహాను 1:29).

శత్రువులను ఓడించే మహాశూరుడు అని యోహాను ప్రభువును పరిచయం చేయలేదు. కాని ఆయన "లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల"యనియే తెలిపాడు. ఈ విషయాన్ని గమనించాలి. శ్రేష్ఠమైన జీవిత విధానాన్ని ప్రభువు బోధింపవచ్చాడు. మనం ఎలా జీవించాలో ఆయన ఆదర్శాన్ని ప్రదర్శించాడు. వీటన్నిటికంటెను అతి ప్రధానంగా ఆయన మన పాపములకై మరణించ వచ్చాడు (లూకా 19:10 చూడు). ఉపదేశించే గురుతుగా గొఱ్ఱె ఉపయోగింపబడలేదు. బలిపీఠం మీద తమ ప్రాణాలు అర్పించడం ద్వారా పాప విముక్తికి గొఱ్ఱెలు గురుతుగా ఉన్నాయి. యేసు మన పస్కా పశువు (1 కొరింథీ. 5:7), ఆయన "నిర్దోషమును, నిష్కళంకమునగు" గొఱ్ఱెపిల్లవంటి వాడు (1 పేతురు 1:19).

ఆ తరువాత, యేసు మెస్సీయా అయ్యున్న సంగతి తాను ఎలా ఎరిగాడో వివరిస్తున్నాడు. (యోహాను 1:31–33). "ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితిననెను" (యోహాను 1:34).

అభ్యాస సంబంధమైన ఉద్దేశం మేరకు, యోహాను యొక్క పని ముగిసి పోయింది. అయినప్పటికి యింకా కొన్ని నెలలు తన ప్రకటనను, బాప్తిస్మాన్ని కొనసాగించాడు.[31] తనకు అప్పగింపబడిన దేవుని పనిని అతడు విజయవంతంగా ముగించాడు. అంతకంటె అధికంగా ఏ నరుడును చేయలేదు

## ముగింపు

ప్రభువైన యేసు పరిచర్యకు సమస్తము సిద్ధమైయున్నది. "ప్రతి దానికి ఒక తొలిసారి" అనే తరువాత పాఠంలో యేసు బహిరంగ పరిచర్యకు ప్రారంభాన్ని చూస్తాం.

యేసు సిద్ధపాటులో అవసరమైన భాగం ఆయన బాప్తిస్మం. నీవు ప్రభువును ప్రేమించి సేవింపగోరితే మొదటిగా నీవు విశ్వాసము, బాప్తిస్మముల ద్వారా దేవుని కుమారుడవు

కావాలి (గలతీ. 3:26, 27). రమారమి 70–80 మైళ్లు బాప్తిస్మం పొందడానికి నడచి వెళ్లాడు.[32] వెంటనే బాప్తిస్మం పొందడానికి నీవు నడుస్తావో, వాహనమే ఎక్కివెళ్లతావో లేక పరిగెత్తుతావో! [33]

---

## సూచనలు

[1]అర్థము కొరకైన చర్చకు "పరలోక రాజ్యము" అనే పాఠాన్ని చూడు. [2]యోహాను పనిని తక్కువగా అంచనా వేయకూడదు. "సువార్త ప్రారంభము" అని మార్కు పిలిచాడు (మార్కు 1:1). యోహాను బాప్తిస్మము మొదలుకొని పద్ధతి ప్రకారం సువార్త ప్రారంభమైనట్టు (అపొ. 1:21, 22; 10:37, 38) కార్య గ్రంథంలో ఉంది. యోహాను పని విషయమై ఎక్కువ వివరాలకు "యేసు బాప్తిస్మం పొందిన రోజు" అనే పాఠాన్ని ట్రూత్ ట్రూత్ ఫర్ టుడే (ఆంగ్ల) సంచికలో చూడు [3]బాప్తిస్మమిచ్చు యోహాను గూర్చిన చర్చకొరకు "క్రీస్తు వస్తున్నాడు" అనే పాఠాన్ని చూడు. [4]అయిదుగురు రాజకీయ నాయకులను గూర్చిన పూర్వగాథను "క్రీస్తు వస్తున్నాడు" అనే పాఠం చూడు. [5]ఇద్దరు మతనాయకుల వివరాలకు "దేవుడు మరియను ఎందుకు ఎన్నుకున్నాడు" అనే పాఠం చూడు. [6]మారుమనస్సుకు నిర్వచనం "కార్యగ్రంథం భాగం 1లో" చూడు. [7]అభ్యాస సంబంధమైన భాగం యిది. నీవు దీన్ని పెంచగోరవచ్చు. [8]మీ ప్రాంతలోని వాడుకను ఉపయోగించు. [9]ఈ ప్రతిపాదనలో "all" అని రెండు సార్లు ఉపయోగించడం అధిక సంఖ్యను సూచించడానికి ఉపయోగించబడింది. [10]యోహాను బాప్తిస్మానికి క్రొత్త నిబంధన బాప్తిస్మానికిని తారతమ్యాలు చూడవచ్చు (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). వాటిలో ఒకటి – యోహాను బాప్తిస్మం, వారు తమ పాపములను ఒప్పుకొని బాప్తిస్మం పొందారు; క్రొత్త నిబంధనలో యేసునందు తమ విశ్వాసాన్ని ఒప్పుకొని (అ.పొ. 8:35–38; రోమా 10:9, 10) బాప్తిస్మం పొందారు.

[11]యోహాను బాప్తిస్మానికిని, ఆచార సంబంధమైన పక్షాళనలకు చాలా వ్యత్యాసముంది. [12]అదే విధమైన బాప్తిస్మాన్ని యితరులు జరిగిస్తున్నట్టయితే, యోహాను దానికి ఆలాటి గుర్తింపుతో కూడిన పేరు యివ్వక పోయి ఉండవచ్చు. [13]The Analytical Greek Lexicon (London: Samuel Bagster & Sons Ltd., 1971), 65. [14]క్రొత్త నిబంధన బాప్తిస్మాన్ని "విశ్వాసపు బాప్తిస్మమని" పిలువ వచ్చు. [15]అంగీకరించని వారిని గూర్చి మార్కు మాట్లాడ లేదు గనుక, కేవలం పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని గూర్చి మాత్రమే పలికాడు (మార్కు 1:8). యోహాను కూడా పరిశుద్ధాత్మను గూర్చియే పలికాడు (యోహాను 1:33). అయితే మత్తయి లూకాలు, మిశ్రిత శ్రోతలను చిత్రించారు (లూకా 3:7). అందువలన పరిశుద్ధాత్మలోను అగ్నితోను బాప్తిస్మమిచ్చునట్లు వ్రాశారు (లుకా 3:16). [16]"యేసు బాప్తిస్మము పొందిన రోజు" అనే పాఠం ఆంగ్లములో ట్రూత్ టుడే ప్రచురించిన "Narrative Preaching"లో యింకా కొంత ఆలోచనల కొరకు చూడు. [17]మరియ ఎలీసబెతులను గూర్చిన చర్చకు "దేవుడు మరియను ఎందుకు ఎన్నుకున్నాడు" అనే పాఠం చూడు. [18]దేవుని అజ్ఞాలన్నియు నీతిగలవని కీర్తన రచయిత అన్నాడు (కీర్తన. 119:172). [19]ఈ సత్యము "యేసు శోధనల"యందు నొక్కి చెప్పబడింది. [20]తన జీవితంలోని కీలక సంఘటలలో యేసు ప్రార్థించినట్టు లూకా తెలిపాడు (6:12, 13; 9:28, 29; 22:44, 45; 23:33, 34, 46).

[21]పరిశుద్ధాత్మ పావురము అని దైవ ప్రేరేపితుడగు లేఖకుడు చెప్పలేదు. కాని ఆయన పావురమువలె దిగివచ్చినట్టు చెప్పాడు. [22]దేవత్వంలోని ముగ్గురు వ్యక్తులు తేటగా కనబడుతున్నారు – మూడు ప్రత్యేకమైన స్థలములలో ఉన్నట్టు దేవత్వాన్ని మనం పూర్ణంగా అర్థం చేసుకో లేకపోయినా, విశ్వాసంతో మనం బైబిలు ఉపదేశాన్ని అంగీకరిస్తాం. [23]పరీక్షించేదంత దేవుని మేలుకొరకు కాదు, మన మేలునకే. దేవునికి రుజువు అక్కర లేదు అది మనకే కావాలి. గనుక సంఘటనల వివరాలు మనకొరకు వ్రాయబడ్డాయి. [24]లూకా 4:2లో నలభైదినాలు పూర్తిగా ప్రభువు శోధింపబడినట్టు సూచిస్తుంది. ఆయన అనుభవించిన శోధనలలో ఆ మూడును శిఖరాగ్రాన్ని చేరినవి కావచ్చు. లూకా ఒక క్రమంలోను, మత్తయి మరో క్రమంలోను వాటిని దాఖలు చేశారు. [25]ప్రభువైన యేసు ఎలా శోధింపబడ్డాడనే అనేక చర్చలలో పరిమితి మనస్సులు తేల్చ లేవు. [26]యేసు పాపరాహిత్య జీవితానికి యోహాను 8:46; హెబ్రీ. 7:26; 1 పేతురు 1:19; 1 యోహాను 3:5. [27]వచ్చినవారు "నీవు క్రీస్తువా?" అని అడిగారో లేదో తెలియదు. వారు కావాలని కోరింది అదేనని యోహాను గ్రహించినట్టు మనకు తెలుసు. [28]ఈ ప్రవచనము క్రీస్తునందు నెరవేరింది (అపొ. 3:20, 22). [29]మార్కు 1:2, 3లో యెషయా మాత్రమే ప్రస్తావించబడ్డాడు. అయితే ప్రవచనాలు యెషయా, మలాకీ అనే యిద్దరి నుండి వచ్చాయి. [30]అసలైన ఏలీయా రాకకొరకు

అనేకులైన యూదులు నేటికిని కనిపెడుతున్నారు.

[31]అతని పరిచర్యయు, ప్రభువు యొక్క పరిచర్యయు కొద్ది నెలలు ఒకదాని మీద ఒకటి పడియుంటుంది. ఆ సమయంలో యోహాను పని తగ్గుతు ప్రభువు పని ఎక్కుతూ ఉంది. యోహాను 3:22–4:2 చూడు. [32]బాప్తిస్మమునకు ప్రభువు నడిచిపోయింది, ఆ సమయానికి యోహాను ఎక్కడ ఉన్నాడు అనే దాని మీద ఆధారపడి యుంటుంది. [33]ఇక్కడ మరోక వర్తింపు చేయవచ్చు. అవసరమైన సిద్ధపాటు నెరవేర్చ బోయేపనికి తప్పని సరి. [34]G. Campbell Morgan, *The Crises of the Christ* (New York: Fleming H. Revell Co., 1936), 107-36.